క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో అదనపు బస్సులు, బస్సు వేళల్లో మార్పులు, సలహాలు, సూచనలను ప్రయాణికుల నుంచి స్వీకరించబడతాయని తెలిపారు. ఫోన్ నెంబర్ 99592 26003లో సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి సాయం



మాట్లాడుతున్న మోహన్‌రావ్ పటేల్

తానూరు: మండల కేంద్రానికి చెందిన పవార్ వందన ఇల్లు ఇటీవల షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ప్రజాట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావ్ పటేల్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇల్లు నిర్మించేందుకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నిత్యావసర సరుకులు అందజేశారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

22న ఇసుక వేలం

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఈనెల 22న ఇసుక డంపులు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. ఇటీవల పట్టణంలోని పలు చోట్ల గుర్తించిన అక్రమ ఇసుక డంప్‌లను సీజ్ చేశామన్నారు. వాటిల్లో 8 ఇసుక డంప్‌లకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.5వేలు అడ్వాన్స్‌గా డిపాజిట్ చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సమత ఫౌండేషన్ చేయూత

నర్సాపూర్(జి): మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళలు తోట రాజవ్వ, సునీత (మానసిక దివ్యాంగురాలు) ఉంటున్న ఇల్లు కూలిపోయింది. వారికి రేషన్ కార్డు, ఆధార్ లేక ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఈ విషయం తెలిసి సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ స్పందించి వారికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. కూలిన ఇంటికి మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయనను గ్రామస్తులు సన్మానించారు. ఫౌండేషన్ నిర్వాహకులు సాహెబ్ రావు, సీఈఓ అనిల్, పీఆర్‌ఓ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత

భైంసారూరల్: మండలంలోని ఎగ్గాం గ్రామం నుంచి తిమ్మాపూర్‌కు గురువారం అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను ఆర్‌ఐ కృష్ణాగౌడ్ పట్టుకున్నారు. అనంతరం టిప్పర్‌ను భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతుల్లేకుండా మొరం తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లక్ష్యం నిర్దేశించుకోవాలి

లోకేశ్వరం: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని నర్సాపూర్(జి) పోలీస్ కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ అన్నారు. గురువారం లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జీవిత లక్ష్యంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ గౌతమ్, అధ్యాపకులు విఠల్, చిన్నయ్య, శ్రీనివాస్, వినోద్‌కుమార్, మహేందర్, ప్రమీలరాణి, నవీన్, సాయినాథ్ ఉన్నారు.

నిరుపేదలకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న వినోద్‌రావు

ఖానాపూర్: మానవ సేవే మాధవ సేవ అని నిర్మల్ ప్రధాన కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో జననీ ఫౌండేషన్ 50 మంది నిరుపేదలకు దుస్తులు సమకూర్చగా ఆయన హాజరై పంపిణీ చేశారు. చలికాలం దృష్టిలో ఉంచుకొని పలువురికి శాలువాలను అందజేశారు. రాము నాయక్, అశోక్‌రావు, తోట సుమిత్, వెంకట్ మహేంద్ర, మట్టేరి రాజశేఖర్, బాశెట్టి శివ, శంకర్, మనోజ్ తదితరులున్నారు.

మధుమేహంపై అవగాహన ర్యాలీ

భైంసాటౌన్: ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కాశీనాథ్ ర్యాలీ ప్రారంభించారు. ఏపీ నగర్, తదితర కాలనీల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లతో మధుమేహం బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా షుగర్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య భారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రామకృష్ణగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, ఆస్పత్రి సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

కోరికలు తీర్చే విఠలేశ్వరుడు..

- తానూరులో నేటి నుంచి జాతర
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- తరలిరానున్న భక్తజనం
- కార్తీకమాసం నేపథ్యంలో సరిహద్దు ఆలయాల్లో కొనసాగుతున్న పూజలు
- రేపు కుస్తీ పోటీలు



ముస్తాబైన ఆలయం



ఆలయంలో విఠలరుక్మాబాయి ప్రతిమలు

తానూరు: భక్తుల కోరికలు తీర్చే మహారాష్ట్రలోని పండరీపురం విఠలేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసంలో నెలరోజులు జరిగే పూజాది కార్యక్రమాలను తానూరులోని విఠలేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తారు. అందుకే తానూరును మరో పండరీపురంగా భావిస్తారు. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లోని విఠలేశ్వరస్వామి ఆలయాల్లో హరినామ సప్తాహం కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పలువురు తులసీమాలలు స్వీకరించి పూజలు చేస్తున్నారు. కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని ఈసారి శుక్ర, శనివారాలు(రెండు రోజులు) జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మండల కేంద్రంలోని ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. జాతరకు ఈ ఏడాదితో 106 ఏళ్లు పూర్తి కానున్నాయి.

కార్తీకమాసం నుంచి ఉత్సవాలు..

తానూరు విఠలేశ్వరస్వామి ఆలయంలో ఏటా కార్తీకమాసం నుంచి ఉత్సవాలు సాగుతాయి. మొదటి ఏకాదశి నుంచి ఇక్కడ వేడుకలు ప్రారంభం కావడంతో పల్లకీ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొంటున్నారు. ఏకాదశి మంగళవారం హనుమాన్, ద్వాదశి బుధవారం గరుడ వాహనము, గురువారం త్రయోదశి ఏనుగు, వాహనాలతో శోభాయాత్ర సాగింది. విఠలేశ్వరస్వామి దీక్షాపరులు ఆలయంలో నిత్యం భజనలు చేస్తున్నారు. స్వామివారికి సాయం, సంధ్య వేళల్లో మంగళహారతులు ఇస్తున్నారు.

స్వామివారి రథం ఊరేగింపు..

జాతర సందర్భంగా కార్తీక చతుర్థి పౌర్ణమి రోజున శుక్రవారం రాత్రి 12 గంటలకు విఠలేశ్వర స్వామివారి రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ పూజారి పింటు మహారాజ్ తెలిపారు. ప్రధాన వీధుల ఉండా సాగే రథం ఊరేగింపులో వివిధ ప్రాంతాల ప్రజలు పాల్గొంటారు. రథాన్ని లాగితే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. శనివారం రాత్రి పాండురంగ్ పల్లకి శేషార్థితో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ పూజారి పింటు మహారాజ్ పేర్కొన్నారు.

ఆలయంలో హరినామ సప్తాహం..

ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో వారం రోజులుగా అఖండ హరినామ సప్తాహం కొనసాగుతోంది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన, రాత్రి కీర్తనలు ఆలపిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో మండల కేంద్రంతోపాటు మహారాష్ట్రలోని గ్రామాల వార్‌కరి భక్తులు పాల్గొంటున్నారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి...

జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. మనరాష్ట్రంతోపాటు మహారాష్ట్రలోని ధర్మాబాద్, దేడ్ కర్ ప్రాంతాల భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. పోలీసులు సైతం అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

మల్లయోధులకు కుస్తీపోటీలు..

జాతర సందర్భంగా గ్రామ కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయా ప్రాంతాల నుంచి వచ్చే మల్లయోధులకు కుస్తీపోటీలు నిర్వహిస్తారు. ప్రథమ బహుమతిగా రూ.11,111 వేలు, వెండి కడియం, ద్వితీయ బహుమతిగా రూ.8,851 వెండి కడియం బహుకరించి మల్లయోధులను సన్మానిస్తారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: ఎన్నికల వేళ కాంగ్రెస్ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా విస్మరించిందని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నాయగావ్‌లో బీజేపీ అభ్యర్థి రాజేశ్ సంభాజీ పవార్ తరఫున రత్నెల్లి, బాలాపూర్, ధర్మాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని.. బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని అక్కడి ప్రజలను కోరారు.

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

నిర్మల్‌టౌన్: మారుతున్న జీవనశైలితో రోగాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలని పలువురు డాక్టర్లు పేర్కొన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలువురు డాక్టర్లు.. వాకర్లకు ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో కలిగే లాభాలను వివరించారు. నిత్యం వ్యాయామం చేస్తూ.. తాజా కూరగాయలు, పండ్లను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. డాక్టర్లు కష్ణంరాజు, దయాకర్ యాదవ్, రఘునందన్ రెడ్డి, క్లబ్ నిర్మల్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి మేకల శ్రీనివాస్ యాదవ్, నారాయణగౌడ్, నేరెళ్ల హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

భైంసాటౌన్: పట్టణంలోని మిర్జాపూర్ పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కస్టర్ అధికారి జగదీశ్ జెండా ఆవిష్కరించారు. కార్యదర్శి రాజేందర్, శ్రావణ్, శివ, సురేశ్, సాయన్న పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని హంగిర్గా పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం సహకార వారోత్సవాలు నిర్వహించారు. సొసైటీ బ్యాంక్ ఆవరణలో చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్ జెండాను ఆవిష్కరించారు. ఈనెల 21వరకు వారోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్, సీఈవో భూమన్న పాల్గొన్నారు.

కుంటాల: రైతుల అభ్యున్నతికి తమ వంతుగా కృషి చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పేర్కొన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం పీఏసీఎస్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించారు. సీఈవో నాగభూషణం, డైరెక్టర్ ప్రణయ్ రావు,సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి,బోజేందర్, మహేష్,కృష్ణ, గజ్జారాం, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే



ఖానాపూర్: రాజురాలో సర్వే చేస్తున్న సిబ్బంది

ఖానాపూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతోంది. మండలంలోని రాజురా గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను సూపర్‌వైజర్ పరాంకుశం నరసింహస్వామి పర్యవేక్షించారు. మస్కాపూర్ సర్వేలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్ పాల్గొన్నారు.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు. సర్వే జరుగుతున్న తీరును ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీంఖాన్ పరిశీలించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్

కడెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి నాయకులకు సూచించారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ సంస్థాగత ఎన్నికల సమీక్షలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రితేశ్ రాథోడ్‌తో కలిసి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వంద సభ్యత్వాలను పూర్తి చేసి క్రియాశీలక సభ్యత్వంలో పాల్గొనాలని సూచించారు. అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, సభ్యత్వ నమోదు కార్యక్రమ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్, మండల పదాధికారులు, పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో గురువారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బూత్, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు అర్జున్ ఠాకూర్, జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, అరుణ్‌లాల్, శ్రీకాంత్‌రెడ్డి, మహిపాల్, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్, పేండ్‌పెల్లి, సుంక్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో బూత్ అధ్యక్షులు బలంగా ఉంటేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. 100 సాధారణ సభ్యత్వాలు నమోదు చేస్తే క్రియాశీలక సభ్యత్వం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దుబాయ్ శ్రీను, రామారావు, చందర్‌పటేల్, నర్సయ్య, రవీందర్ తదితరులు ఉన్నారు.

కుంటాల: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి పేర్కొన్నారు. కుంటాల మున్నూరుకాపు సంఘ భవనంలో పార్టీ సంస్థాగత ఎన్నికల కార్యశాల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆ పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, ఎన్నికల ఇన్‌చార్జి అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, సూర్యవంశీ, నవీన్, సుధాకర్, రవి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో దీపోత్సవం



జిల్లాకేంద్రంలోని బాబా ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సోన్ : న్యూవెల్మల్‌లో ముస్తాబైన ఆలయం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండిరామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం కార్తిక దీపోత్సవం నిర్వహించారు. సాయిదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని 11,116 దీపాలను వెలిగించారు. సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి కోటి వత్తులతో భారీ దీపాన్ని తయారు చేసి వెలిగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పూదరి నరహరి, ఉప్పుల నందు, జైపాల్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోన్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలను ముస్తాబు చేసినట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. శుక్రవారం, శనివారం నిర్వహించే వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బాలల(స్వయంపాలన) దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని వారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు టీచర్లుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. – సాక్షి నెట్‌వర్క్



కుంటాలలోని ఆదర్శ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



తానూరు : ఎల్వి ఉన్నత పాఠశాలలో..



సోన్: సిద్దులకుంట ఉన్నత పాఠశాలలో..



లోకేశ్వరం : రాజూర ప్రాథమిక పాఠశాలలో..



కడెం: లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



నిర్మల్‌రూరల్: రత్నాపూర్ కాండ్లీ పాఠశాలలో..



బాసర : కౌటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

క్రీడా దుస్తులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని లక్ష్మినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మల్‌కు చెందిన గణేశ్ క్లాత్ ఎంపోరియం యజమాని దినేశ్ 31 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రకాంత్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాజారాం, పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు అశోక్‌రెడ్డి, హెచ్ఎం శ్రీమల తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరం ఉండాలి

ఖానాపూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి లక్ష్యంతో ముందుకుసాగాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. గురువారం పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో డబుల్ బెడ్‌రూం కాలనీవాసులకు మత్తుపదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీసీ కెమెరాలతో ప్రయోజనాలు, రోడ్డు నిబంధనలు, సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్, ఏఎస్సై రాంచందర్ తదితరులు ఉన్నారు.

పెంబిలో..

పెంబి: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరం ఉంటూ కష్టపడి చదువుకోవాలని పెంబి ఎస్సై సాయి కుమార్ అన్నారు. గురువారం పెంబి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై మాట్లాడారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.

గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపిక



కాలేరి మధు



కుంట రుచిత



బొల్ల గంగాధర్



పి.కృష్ణచైతన్య



పిట్ల శృతి

దిలావర్‌పూర్:మండల కేంద్రానికి చెందిన నలుగురు గ్రూప్-4 పరీక్షల్లో ప్రతిభను చాటి ఉద్యోగాలు సాధించారు. దిలావర్‌పూర్‌కు చెందిన కాలేరి మధు అటవీశాఖలో పని చేస్తూ ట్రెజరీశాఖలో, కుంట రుచిత జూనియర్ అసిస్టెంట్‌గా, బొల్లా గంగాధర్ మున్సిపల్‌శాఖలో ఉద్యోగాలు సాధించారు. ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వర్తించిన బెజ్జారం నవీన్ కుమార్ రెవెన్యూలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

భైంసాటౌన్: గ్రూప్-4 పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిన పి.కృష్ణచైతన్య ప్రతిభ కనబరిచాడు. జిల్లా స్థాయిలో 44వ ర్యాంకు సాధించి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

దస్తురాబాద్: మండలకేంద్రానికి చెందిన పిట్ల శృతి గురువారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ చాటి ఉద్యోగానికి ఎంపికైంది. ఇప్పటికే శృతి పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికై హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవడంపై కుటుంబసభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

ఖానాపూర్: పట్టణంలోని ఏసీఈ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్, కరస్పాండెంట్ అబ్బుబాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు పలు వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి, కుంటాల సృజన విద్యా నిలయం పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు కొత్తకాపు గంగన్న, బోయ సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అధికారులపై దాడులు సహించబోం'



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తే సహించేది లేదని ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ నాయకులు అన్నారు. వికారాబాద్ కలెక్టర్, కూడా చైర్మన్ వెంకట్రామి రెడ్డిపై లగచర్లలో దాడిని నిరసిస్తూ టీఈజేఏసీ జిల్లా ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని శిక్షించి ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మన్ వెల్మల ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు ఎంసీ.లింగన్న, రమేశ్, జుట్టు గజేందర్, జె.లక్ష్మణ్, వై.సాయన్న, కృష్ణకుమార్, అశోక్, రవి, శ్రీనివాస్, స్రవంతి పాల్గొన్నారు.